# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిశీలించారు.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపిబి ఈ రోజు సమావేశమైంది.**

**3. వాట్సప్ ద్వారా పౌర సేవలు అందించే విధానాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు ప్రారంభించారు.**

**4. రాష్ట్రంలో అర్ధరాత్రి 12 గంటల వరకు హొటళ్లు తెరిచి ఉంచేందుకు త్వరలో మార్గదర్శకాలను విడుదల చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

**5. గుంటూరు జిల్లా మంగళగిరిలో 10 ఎకరాలలో భారీ చేనేత కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు.**

==========================

కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొద్దిసేపటి క్రితం పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం 11 వేల 400 కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించిన తర్వాత తొలిసారిగా ఈ రోజు కేంద్రమంత్రులు పర్యటించారు. ఇందులో భాగంగా ఉక్కు కర్మాగారం యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులతో సమావేశమై ఉక్కు పరిశ్రమ స్థితిగతులు, ఇతర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపిబి ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో దాదాపు 20 వేల ఉద్యోగాలు కల్పించే 44 వేల 776 కోట్ల రూపాయల పెట్టుబడులపైనా ఈ సమావేశంలో చర్చించనుంది. అలాగే 15 ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడులకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

వాట్సప్ ద్వారా పౌర సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఐటీ శాఖ

మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో వాట్సప్ పరిపాలనా సేవలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్..28 సెకన్లు

---

రహదారి నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని రాయలసీమ ప్రాంత రవాణా శాఖ కమిషనర్ బి.శ్రీక్రిష్ణవేణి తెలిపారు. తిరుపతిలో జరిగిన రహదారి భద్రతా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఈరోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... యువత భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు వాహనదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కలుగచేస్తున్నామని తెలియచేస్తూ ..

వాయిస్ .. 34 సెకన్లు

---

రాష్ట్రంలో అర్ధరాత్రి 12 గంటల వరకు హోటళ్లు తెరిచి ఉండేందుకు అవకాశం కల్పిస్తామని, త్వరలో మార్గదర్శకాలను విడుదల చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కాకినాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో మంత్రి నిన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక అభివృద్ధికి, హోటళ్ల రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, హోటళ్లకు విద్యుత్తు, ఇతర రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తామని మంత్రి వివరించారు.

---

చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో 10 ఎకరాలలో భారీ చేనేత కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆమె వెల్లడించారు. చేనేత కేంద్రాన్ని ఏర్పాటు చేసే స్థలాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేత కార్మికులకు సంవత్సరం పొడవునా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని తెలియచేశారు. నేత కార్మికులకు ఆర్ధికంగా చేయూతను ఇచ్చేందుకు దేశంలోని పలు నగరాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేశామన్నారు.

---

జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా దిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీ సమాధి వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు నివాళులర్పించారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ దన్‌ఖఢ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు మంత్రులు కూడా రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం సర్వ మత ప్రార్ధనలు నిర్వహించారు.

---

మహాత్మా గాంధీ జీవితం నేటికీ స్ఫూర్తి దాయకమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఈ రోజు ఒంగోలులో ఆయన

విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్... 26 సెకన్లు

---------------------------

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన నిన్న మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి కోసం గత ఏడు నెలల్లో 6.33 లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులకు సంబంధించి వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. వీటి ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

ఇంటర్మీడియట్ విద్యలో ప్రతిపాదిత సంస్కరణలపై వచ్చిన సూచనల మేరకు వచ్చే ఏడాది నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను యధాతథంగా నిర్వహించనున్నామని ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రకటించింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి-ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల అమలు, పరీక్షల నిర్వహణ, అంతర్గత మార్కుల విధానం వంటి పలు ప్రతిపాదనలపై ఈనెల 26వ తేదీ వరకు విద్యా మండలి సలహాలు, సూచనలు స్వీకరించింది.

---------------------------

సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు ప్రజలకు అవగాహన కలుగజేస్తున్నామని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాగ్ స్క్వాడ్, పెరేడ్ మైదానాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం డిజిపి పాత్రికేయులతో మాట్లాడుతూ....

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా హరీష్‌కుమార్ గుప్తా నియమితులయ్యారు. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయన ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు రేపు పదవీ విరమణ చేయనున్నందున ఆయన స్థానంలో హరీష్‌కుమార్ గుప్తాకు పోలీసు దళాల అధిపతిగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

వికసిత్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను భాగస్వామ్యం చేసేందుకు 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల కార్మికశాఖ మంత్రుల సమావేశంలో నిన్న ఆయన పాల్గొని ప్రసంగించారు.

=====================